# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక




సంపుటి: 25 సంచిక: 12 హైదరాబాద్ 2026 ఏప్రిల్ పేజీలు: 40

Please visit : www.srimeherbaba.com విడిప్రతి 20/-

# బాబా ప్రేమికుల శ్రీలంక యాత్ర

## 2026 మార్చి 18-26












# అవతారుడు పర్యటించిన
# ద్వీప దేశంలో

**"నేను ఒక ప్రదేశాన్ని సందర్శించి, అక్కడ ఎంత తక్కువ సమయం గడిపినా, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణంలో గణనీయమైన మార్పు కనపడుతుందన్నారు మెహెర్‌బాబా. ఆ ప్రదేశం ఆధ్యాత్మికంగా పవిత్రమవుతుంది. ఆ ప్రాంతం ఎన్నో విధాల ఉన్నతి చెందు తుందని, మెహెర్‌బాబా పలు సందర్భాలలో చెప్పారు. ఇది మెహెర్ ప్రేమికులందరికీ అనుభవపూర్వకమే. ఈ మాటలు శ్రీలంక దేశం విషయంలో అక్షర సత్యం.**

**మెహెర్‌బాబా శ్రీలంకను 1933 జనవరిలో 19 రోజులు, 1940 నవంబరులో 33 రోజులు పర్యటించారు. రెండవ** ప్రపంచ యుద్ధ సమయంలో మస్తు చట్టిబాబాతో కలిసి మెహెర్‌బాబా ఈ ద్వీపకల్పంలో ఏకాంతవాసం, మస్తుల సాంగత్యం చేశారు. బాబావారు ఇక్కడ చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఈ సమయంలో పలు సందేశాలను బాబా ప్రవచించారు. ఈ ద్వీపకల్పంలో బాబావారు బస చేసిన దాదాపు అన్ని ప్రదేశాలు సందర్శకులకు నేటికి అందుబాటులో వున్నాయి. ఆనాడు సీతమ్మ అగ్ని ప్రవేశ స్థలాన్ని, రామ–రావణ యుద్ధ ప్రాంతాన్ని, అనేక బౌద్ధారామాలను అవతారుడు సందర్శించారు.

**ఈ అవతారకాలంలో మెహెర్‌బాబా ధనుష్కోటి నుంచి శ్రీలంకలోని తొలి భూభాగం –** తలైమన్నార్ వరకూ సముద్రమార్గాన ప్రయాణించారు. రామాయణంలో శ్రీరాముడు కూడా ఈ మార్గాన్నే వెళ్ళాడు. ఆనాటి రామసేతు మాదిరి తలైమన్నార్‌లో ఫెర్రీ పాయింట్ కూడా నేడు నిరుపయోగమైంది.
అవతారుడు శ్రీలంకలో జరిపిన ఏకాంతవాసం, విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఒక ప్రత్యేకత వుంది. ఆ ప్రత్యేకత ఏమిటో ఈ ద్వీపకల్పంలో ఇటీవల 2026 మార్చి 18 నుండి తొమ్మిది రోజులపాటు నూరు మంది మెహెర్ ప్రేమికులు చేసిన యాత్రలో వారు మనసారా అనుభూతి చెందారు. బాబా పాదస్పర్శతో పునీతమైన అనేక ప్రదేశాలను వారు సందర్శించారు. 2026 మార్చి 26 యాత్ర ముగించుకుని హైదరాబాద్‌కి తిరిగి వచ్చారు. మెహెర్ ప్రేమికుల యాత్రా విశేషాలన్నింటినీ గుదిగుచ్చి ఒక పుష్పగుచ్ఛంలా ఒక ప్రత్యేక సంచికను మెహెర్‌బాబా పత్రిక రూపొందించింది. నేటికి మాసపత్రిక ప్రారంభించి 25 వసంతాలు నిండాయి. తెలుగు పాఠకులకు ఈ సంచికను సవినయంగా అందిస్తున్నాం.

**మా ఈ యాత్రకు "ట్రావెల్ ఫ్యాక్టరి", సికింద్రాబాద్ తగిన బందోబస్త్ చేసింది.** ఆ సంస బృంద సభ్యులందరికీ ధన్యవాదములు. జైబాబా.

***

# శ్రీలంకలో పర్యటించిన పట్టణాలు




**1. కొలంబో – 2. వేయంగోడా – 3. అనురాధాపుర – 4. తలైమన్నార్ – 5. డాంబుల్లా 6. కాండి – 7. సిగిరియా – 8. బండారవేలా – 9. న్యూవారా ఏలియా 10 గాలే. ప్రయాణించిన మొత్తం దూరం. సుమారు 1,500 కిమీ.**

# మెహెర్‌బాబా మండలి

## పరమాత్మ ఆంతరంగికుల జీవిత చిత్రాలు




**అవతారునికి తమ సర్వస్వం అర్పించి, శరణాగతులై** సేవలందించిన బాబావారి సన్నిహిత మండలి అందరూ బాబాలో ఐక్యమయ్యారు. వీరి జీవితాలు బాబా ప్రేమ సందేశానికి ప్రతీకలు. మెహెరాబాద్ కొండపైన స్త్రీ మండలి, కొండ దిగువున పురుష మండలి వారి సమాధులు (60) వున్నాయి. ఆ అద్వితీయ భాగవతోత్తములకి నివాళిగా 'మెహెర్‌బాబా మండలి' పేరిట ఒక చిన్న పుస్తక ప్రచురణ చేపట్టాం. ఈ పుస్తకం గురించి మరిన్ని వివరాలు వచ్చే నెల సంచికలో తెలుసుకుందాం! అందాక జైబాబా.

మా మాటలు

# శ్రీలంక యాత్ర

## చిన్న ఆలోచన

**ఆ మధ్య మెహెరాబాద్‌లో వుండగా ఒక రోజున బాబా పాదస్పర్శతో పునీతమైన శ్రీలంక టూర్ ప్లాన్ చేస్తే బాగుంటుంది కదా అని** యథాలాపంగా శ్రీ రామక్రిష్ణయ్య గారితో అన్నాను. ఆ తర్వాత నాలుగైదు రోజులకి ఆయన హైదరాబాద్‌కి చేరుకున్నాక సంబంధీకులను సంప్రదించి, తగిన ప్లాన్ ఖరారు చేశారు. అంతేకాదు, మీరన్న శ్రీలంక యాత్రకి 'మంచి స్పందన' వుందంటూ ఓ రోజున ఫోన్లో మాట్లాడుతూ చెప్పారు. అలా, తొలుతగా తొమ్మిది రోజుల యాత్రా తేదీలు 2025 డిసెంబరులో ప్రతిపాదిస్తే, శ్రీలంకలో వచ్చిన దిత్వా తుఫాను వల్ల మా యాత్రను వాయిదా వేసుకోవల్సి వచ్చింది. ఆ తర్వాత 2026 మార్చి 18న హైదరాబాద్ నుండి బయల్దేరి తిరిగి మార్చి 26న తిరిగి వద్దామని యాత్ర ఖరారు చేశారు. శ్రీలంక యాత్ర చాలా ప్రత్యేకం అని చెప్పొచ్చు. ఈ సంచికలోని ప్రతిపేజీ చదివితే, పాఠకులకు బాబావారు శ్రీలంకలో నిర్వహించిన విశ్వ కార్యక్రమం ఏమిటో అర్థమౌతుంది స్పష్టంగా.

**అవతారుడు రావణ రాజ్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం గురించి చాలామందికి** సరైన అవగాహన లేదు. మెహెర్ సాహిత్యంలో లంక రాజ్యంలో బాబావారి పర్యటన వివరాలు అనేక పుటలలో కళ్ళకు కట్టినట్లు ఎంతో వివరంగా తెలియజేశారు. శ్రీలంక ద్వీపాన్ని మెహెర్‌బాబా వరుసగా 1932, 1933, 1935, 1940వ సంవత్సరాలలో సందర్శించారు.

**ఐతే, 1940 నవంబరు నెలలో బాబావారి శ్రీలంక పర్యటన చాలా ప్రత్యేకమైంది. ఎలా** అంటారా? అది రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న కాలం. ఆ యుద్ధ సమయంలో అహమ్మద్‌నగర్ నుండి రైల్లో బయల్దేరి చెన్నై చేరుకుని, అక్కడ నుంచి రామేశ్వరం, ధనుష్కోటి దాకా ప్రయాణించి, అక్కడ నుంచి సముద్రయానంలో ఫెర్రీలో శ్రీలంక



రాజధాని కొలంబో చేరుకున్నారు. ఆ మాదిరిగా, మెహెర్‌బాబా మెహెరాబాద్ నుండి సుమారు 1200 కిమీ దూరం ప్రయాణించారు. ఆ సమయంలో బాబా కఠిన ఏకాంత వాసంలో వున్నారు. కొన్నిరోజులు ఉపవాసం వున్నారు. బాబా స్త్రీ మండలితోపాటు, కొందరు పాశ్చాత్య ప్రేమికులు, ఇతర మండలి సభ్యులు అందరూ కలిసి మొత్తం 33 మంది బాబాతోపాటు ఈ పర్యటనలో పాల్గొన్నారు. వీరికి అదనంగా ఒక మస్తు – చట్టిబాబా, మరి కొంతమంది చిన్న పిల్లలు కూడా ఈ బృందంలో పాల్గొన్నారు. ఆ దరిమిలా, మెహెరాబాద్ నుండి బ్లూ బస్‌ని కూడా శ్రీలంకకు తెప్పించారు. ఈ ద్వీప కల్పంలో వున్న ప్రధాన పర్యాటక ఆకర్షణలను బాబా తన మండలితో కలిసి సందర్శించారు. ఈ సమయంలో శ్రీలంకలో బాబా మొత్తం 33 రోజులు బస చేశారు.

**అంతక్రితం అంటే, 1933 జనవరిలో బాబా శ్రీలంక పర్యటనలో భాగంగా ఈ ద్వీపంలో** మొత్తం 19 రోజులు బస చేశారు. ఐతే, 1932, 1935లలో మాత్రం పశ్చిమ దేశ యాత్ర ముగించుకుని, బొంబాయికి తిరుగు ప్రయాణంలో కొలంబోలో ఒక్కరోజు మాత్రమే వున్నారు. అది ట్రాన్సిట్ హాల్ట్ అని చెప్పాలి. 1933 జనవరి, 1940 నవంబరు మాసాల్లో శ్రీలంక పర్యటనలో బాబా బృందం బస చేసిన విశాలమైన బంగళాలు, హోటళ్ళు, బాబా సందర్శించిన ప్రాంతాలు సందర్శకులకు నేటికీ అందుబాటులో వున్నాయి. అవతారుని పాదస్పర్శతో పునీతమైన శ్రీలంకలోని పలు ప్రదేశాలను 2026 మార్చి 18 నుండి 26 వరకూ, మా తొమ్మిది రోజుల యాత్రలో సందర్శించాం.

**ఎన్నో విశేషాలు చోటుచేసుకున్న మా తొమ్మిది రోజుల యాత్ర అత్యంత శోభాయమానంగా ముగిసింది. ఆ వివరాలు లోపలి పేజీల్లో 'శ్రీలంక యాత్రా కథనం' శీర్షికలో చదువుకుందాం!**



# అవతారుని సిలోన్ పర్యటనలు
## 1932 -1940




**మెహెర్‌బాబా శ్రీలంకని వివిధ సందర్భాలలో నాలుగుసార్లు పర్యటించారు. అందులో** ప్రధానంగా 1933 జనవరి నెలలో 19 రోజులు, 1940 నవంబరు 4 నుండి వరుసగా 33 రోజులపాటు శ్రీలంకలోని పలు పట్టణాలలో పర్యటించారు.

**ఈ సమయంలో బాబా తన విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా ఏకాంతవాసం,** ఉపవాసం, మస్తులతో సాంగత్యం నిర్వహించారు. ఐతే, 1932 జూలై, 1935 ఫిబ్రవరి నెలలలో ఒక్కరోజు మాత్రం కొలంబోలో ట్రాన్సిట్ హాల్ట్ చేశారని, మెహెర్ సాహిత్యం స్పష్టం చేస్తోంది.

**1940వ దశకం వరకూ పశ్చిమదేశాలకు రాకపోకలు సముద్ర మార్గంలోనే జరిగేవి. ఆ** రోజుల్లో ఎవరైనా లండన్, యూరోపు దేశాలకు వెళ్ళాలంటే, ప్రధానంగా మన దేశంలోని బొంబాయి రేవు నుండి సిలోన్ ద్వారా యూరోపియన్ దేశాలకు వెళ్ళేవారు. అప్పట్లో విమాన సర్వీసులు లేవు.

**1948 జూన్ 8న ప్రప్రథమంగా బొంబాయి నుండి లండన్‌కి విమాన సర్వీసును ప్రారంభించారు.** బొంబాయి నుండి లండన్‌కి వెళ్ళాలంటే 24 గంటల ప్రయాణం వుండేదని చరిత్ర చెబుతోంది. 40 సీట్లు గల ఈ విమానాన్ని వారంలో ఒక్కరోజు మాత్రమే నడిపేవారు.

**నేడు మన దేశంలోని అన్ని ప్రధాన నగరాల నుండి శ్రీలంకకి సుమారు రెండు గంటల** వ్యవధిలో చేరుకుంటున్నాం.

**నాటికి – నేటికీ ఎంత తేడా! మహా గడ్డు రోజులవి! ఆలాంటి రోజుల్లో, మెహెర్‌బాబా 1931 నుండి 1937 నడుమ పదిసార్లు లండన్, యూరోపు దేశాలను, మూడుసార్లు అమెరికాలో పర్యటించారు.**

# బాబావారి పర్యటన వివరాలు

## ప్రప్రథమంగా 13.7.1932

**ఆ వేళ, బాబా సిలోన్‌లో కొన్ని గంటలు మాత్రమే ఉన్నారు. యూరోపు** పర్యటన ముగించుకుని బొంబాయికి తిరుగు ప్రయాణంలో భాగంగా బాబా సిలోన్‌లో ఆగారు. ఆ తర్వాత అక్కడ నుండి బయల్దేరి బొంబాయికి మూడ్రోజుల తర్వాత చేరుకున్నారు.

## రెండవసారి - 12.1.1933 -30.1.1933 -(19 రోజులు)

**యూరోపు నుండి బొంబాయికి తిరుగు ప్రయాణంలో భాగంగా 1933 జనవరి 12** నుండి 14వ తేదీ వరకూ మూడ్రోజులు సిలోన్ రాజధాని కొలంబోలో బస చేశారు. ఆనాడు బాబా కొలంబోలో 'వైట్ హార్స్' అనే పేరు గల హోటల్‌లో బస చేశారు. ఇది కొలంబో ఓడ రేవుకు దగ్గరలోనే వున్న అతి పెద్ద హొటలు. కొలంబో నగరంలో నిర్మించిన తొలి హోటలు కూడా వైట్ హార్స్ అని చెప్పారు. ఓడ రేవుకి దగ్గరగా వుండటం వల్ల, ఆనాటి పెద్దలు ఈ హోటల్‌లో వుండటానికి ఎక్కువగా ఇష్టపడేవారని స్థానికులు చెప్పారు. సుమారుగా నూరు సంవత్సరాలు నిండుతున్న ఈ హోటలు నేటికీ మరిన్ని హంగులతో యాత్రీకులకు సేవలందిస్తోంది. ఐతే, నేడు ఈ హోటలు పేరు "నిప్పన్" అని పేరు మార్చారని హొటలు యాజమాన్యం తెలిపింది. ఆ తర్వాత 1933 జనవరి 15న బండారవేల పట్టణంలోని బండారవేల హోటల్‌లో ఒక్కరోజు వుండి ఆ ఆ తర్వాత, అక్కడికి దగ్గరలోనే వున్న దియాత లావా విల్లా వాలెన్సియా' అనే బంగళాలో జనవరి 30 వరకూ బస చేశారు. అనంతరం బొంబాయికి తిరుగు ప్రయాణమయ్యారు.



కొలంబోలో బాబా బస చేసిన 'వైట్ హార్స్' హోటలు

## మూడవసారి - 13.2.1935

**ఆ వేళ బాబా బృందం సింగపూర్ నుండి కొలంబోకి మధ్యాహ్నం 2 గంటల సమయంలో** వచ్చారు. స్థానికంగా వున్న విక్టోరియా హోటల్‌లో భోజనం చేశారు. అనంతరం ఆ రోజు రాత్రి 8 గంటలకు సిలోన్‌లో ఓడ ఎక్కి, ఇండియాకు తిరుగు ప్రయాణమయ్యారు. నేడు ఈ హోటల్ని గ్రాండ్ ఓరియంటల్ హోటల్‌గా పేరు మార్చారు. వైట్ హార్స్ హోటలుకు దగ్గరలోనే వుందీ హోటల్. ఈ రెండు హోటల్స్‌ని మేం సందర్శించాం.

## చివరిగా - 3.11.1940 - 5.12.1940 (33 రోజులు)

**1940 ఆగస్టు నుండి 1941 ఆగస్టు వరకూ కఠిన ఏకాంతవాసంలో వుండి కూడా 1940** నవంబరు 3వ తేది నుండి డిశెంబరు 5 వరకూ 33 రోజులు శ్రీలంకలోని పలు పట్టణాలలో పర్యటించారు. మస్తు - చట్టి బాబాతో సహా 33 మందితో మెహెర్‌బాబా తలైమన్నార్ సాయంత్రం 7 గంటలకు చేరుకున్నారు. అక్కడ నుండి వేయంగోడా అనే ప్రాంతానికి 1940 నవంబరు 4వ తేది ఉదయం 5.15 ని. చేరుకున్నారు. వేయంగోడాలో 1940 నవంబరు 15 వరకూ బస చేశారు. అనంతరం, నవంబరు 16 నుండి డిసెంబరు 4 వరకూ కాండి పట్టణంలోని 'ప్రైమ్ రోజ్ హిల్ ఎస్టేట్‌లో బస చేశారు. డిసెంబరు 5న తిరిగి తలైమన్నార్ మీదుగా ఫెర్రీలో ధనుష్కోటి చేరుకుని అక్కడ నుండి కేరళ రాష్ట్రంలోని కాలికట్‌కు పయనమయ్యారు.



బండారవేలా హోటలు ఆరుబయట

# మా యాత్ర - రావణ రాజ్యంలో

**మా యాత్ర 2026 మార్చి 18 నుండి 26 వరకూ తొమ్మిది రోజులపాటు కొనసాగింది.** ఇందులో మొత్తం నూరు మంది పాల్గొన్నారు. అతిపెద్ద బృందం. వయోధికులే ఎక్కువ. మా ప్రయాణానికి రెండు లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క బస్సులో 50 మంది సుఖంగా కూర్చొనే వీలుంది. మరి ప్రయాణంలో పదనిసలు, అలకలు - మూతి విరుపులు, ఇక అవన్నీ షరా మామూలే. యాత్ర ప్రారంభంలో బస్సులో సీట్లు మాకు అనుకూలంగా లేవు. బలవంతులకు ముందు సీట్లు వచ్చాయని, వయస్సురీత్యా పెద్దవాళ్ళకు బస్సులో వెనుక సీట్లు వచ్చాయని కొందరు బాధపడ్డారు.రెండు బస్సులు కావడంతో తమ స్నేహితులు ఒకచోట, తామొకచోట వుండిపోయామనుకున్నారు కొందరు. ఐతే, ఇవన్నీ మొదటి రెండుమూడు రోజుల్లోనే సర్దుమణిగాయి. ఆ తర్వాత వయోధికులకు ముందు వరుసలో సర్దుబాటు చేశారు. ఆ పిదప బాబా ప్రేమికులు అందమైన శ్రీలంకలో ఫోటోలు, వీడియో చిత్రీకరణతో మునిగి, ఆపై అన్నింటినీ మరచిపోయారు. ఈ తొమ్మిది రోజుల్లో సుమారు రెండువేల కిలో మీటర్లు ప్రయాణించినట్లు భోగట్టా. శ్రీలంక రహదార్లు నిడివి సాధారణంగా 30-40 అడుగుల మించి వుండవు. ఐతే గుంటలు ఎక్కడా లేవు. రహదార్లు పరిశుభ్రంగా వున్నాయి. అంతేకాదు, మన దేశంలో మాదిరి రోడ్డు ప్రక్కన కాలు ముడిచే సాంప్రదాయం ఈ చిన్ని ద్వీపంలో కూడా నిషిద్ధం.

**స్థానికంగా ద్రవ్యోల్బణం చాలా ఎక్కువగా వుంది. మన రూపాయికి శ్రీలంక కరెన్సీ మూడు** రూపాయల ముప్పై పైసలు ఇచ్చారు. శ్రీలంక కరెన్సీలో టీ కోసం కొన్నిచోట్ల 200 రూపాయలు, కొబ్బరి బోండాం 300 రూపాయలు ఇవ్వవల్సివచ్చింది. అన్ని నిత్యా వసరాలు ఖరీదే అనిపిస్తుంది. మనదేశ 500 రూపాయల్ని చాలాచోట్ల ఆనందంగా తీసుకున్నారు. సామాన్యుల జీవనం తడిబిడిబిడియే! పెట్రోలు లీటరు ధర 300 రూపాయలకు పైగానే వుంది. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం వల్ల తీవ్ర ఇంధన కొరత వుంది ఆ దేశంలో. ఈ సమస్య వల్ల 2026 ఏప్రిల్ నెలలో హైదరాబాద్ నుండి సిలోన్‌కు బయల్దేరిన టూరిస్టు ఏజెన్సీలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నామని చెప్పారు. ఇదొక వింత పరిస్థితి సుమీ! కొలంబోలో వున్న ఓ చైనా షాపింగ్ మాల్‌కి మా యాత్రలో ఆఖరి రోజున వెళ్ళాం. అక్కడ అందరూ దండిగా కొనుగోలు చేశారు. చివరిగా మా దగ్గర శ్రీలంక కరెన్సీలో నాలుగు వందలు మిగిలాయి. ఆ కరెన్సీని ఖర్చు చేద్దామంటే విఫల ప్రయత్నమే అయ్యింది. ఆదీ పరిస్థితి!

**ఇకపై ప్రక్క పేజీలలో శ్రీలంకలో మా రోజువారి పర్యటన విశేషాలు తెలుసుకుందాం!**

# రావణ రాజ్యంలో

## మొదటి రోజు – 2026 మార్చి 18, బుధవారం

## వేయంగోడా ఎస్టేట్

**– కొలంబో నుండి వేయంగోడా సందర్శన**

**– ఇక్కడ 1940 నవంబరు 4 నుండి 15 వరకూ బాబా బస చేశారు.**

**ఆ వేళ ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుండి శ్రీలంక రాజధాని కొలంబోకు విమానంలో** బయల్దేరాం. మ.12 కల్లా కొలంబో చేరుకున్నాం. అక్కడ నుండి తిన్నగా అవతారుని పాదస్పర్శతో పునీతమైన పలు ప్రాంతాల సందర్శనకు బయల్దేరాం. ముందుగా, వేయంగోడా అనే ప్రాంతానికి వెళ్ళాం. ఇది కొలంబో నుండి సుమారు 40 కిమీ దూరంలో వుంది. ఒక గంట ప్రయాణం తర్వాత వేయంగోడాకు చేరుకున్నాం.

**1940 నవంబరు నాల్గవ తేది నుండి నవంబరు 15 వరకూ మెహెర్‌బాబా 33 మంది** శిష్యులు, మస్తు – చట్టిబాబాతో కలిసి వేయంగోడాలో వున్న బంగళాలో బస చేశారు. ఈ బంగళా నాలుగైదు ఎకరాల విస్తీరంలో వుంది. విశాలమైన ఈ ప్రశాంత ప్రాంగణం కొబ్బరి చెట్లతో నిండివుంది. బాబా బృందం ఇక్కడకు పర్యటించి నేటికి రమారమి 85 సంవత్సరాలు నిండింది. ప్రస్తుతం, ఈ భవన యజమానులు ఇక్కడ ఉండటం లేదు. కేర్‌టేకర్‌ల ఆధీనంలో వుంది. ముందుగా, మా బృంద నాయకులు శ్రీ బి. రామక్రిష్ణయ్య



దృఢంగా వున్న వేయంగోడా బంగళా

ఆనాటి బాబావారి పర్యటన విశేషాలు తెలియజేశారు. సుమారు అరవై నిముషాలకు పైగా ఆ ప్రాంగణంలో గడిపి, బాబా ప్రార్థనలు, ఆరతి పట్టి, కొలంబోలో ఏర్పాటు చేసిన మా బసకి బయల్దేరాం.

## వేయంగోడాలో బాబా పర్యటన విశేషాలు

**1940 ఆగస్టు నుండి 1941 ఆగస్టు వరకూ అంటే ఒక ఏడాది కాలం కఠిన ఏకాంత** వాసంలో వుంటానని బాబా ఒక ఏడాది ముందుగానే తెలియజేశారు. ఈ సమయంలో కొంతకాలం శ్రీలంకలో వుండాలని నిర్ణయించారు. అలాగే, ఈ సమయంలో తానెవరికీ దర్శనం ఇవ్వనని ప్రకటించారు. ఈ మేరకు ఒక సర్క్యులర్ కూడా విడుదల చేశారు. శ్రీలంకలో తన ఏకాంతవాసం కోసం సముద్రపు వొడ్డున అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేయ్యాలని మందుగా తన మండలి వారిని శ్రీలంకకు పంపారు. అలా వచ్చిన మండలి వారు సుమారు 10 రోజులపాటు బాబా సూచించిన ప్రదేశం కోసం కొలంబో చుట్టుప్రక్కల ఎంత వెదికినా, సముద్ర తీరాన అనువైన వసతి చిక్కలేదు.

**ఐతే, స్థానికంగా సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా శ్రీలంకలో వ్యాపారం చేసుకుంటున్న** ఒక పార్శీ వ్యాపారి రుస్తుంజీ రత్‌షా, 'వేయంగోడా' అనే ప్రాంతంలో తాను కొత్తగా నిర్మించుకున్న బంగళా బాబావారికి అనువుగా వుంటుందని చెప్పాడు. బాబావారికి అంగీకారమైతే, వారికి ఇష్టమైనన్ని రోజులు అక్కడ వుండవచ్చని మండలికి తెలియజేశాడు. ఈ బంగళా హిక్‌గాల్లా ఎస్టేట్స్‌లో వుంది. ఇది సముద్రతీరానికి దగ్గరగా లేదు కాని, చక్కని ఏకాంత ప్రదేశం. బాబావారికి అనువైన చోటు దొరికే వరకూ ఎన్ని రోజులైనా ఆయన ఇక్కడ వుండ వల్సిందిగా రుస్తుంజీ కోరాడు. ఈ విషయాన్ని బాబావారికి టెలిగ్రాం ద్వారా తెలియజేయగానే, బాబా అందుకు అంగీకరించారు. ఆ పిదప, బాబా బృందం మెహెరాబాద్ నుండి 1940 నవంబరు 1న శ్రీలంకకి బయల్దేరారు. ఆ బృందంలో బాబా మండలితోపాటు మస్తు - చట్టి బాబా, ఇతర ప్రేమికులు మొత్తం 33 మంది



అహమ్మద్‌నగర్ నుండి రైల్లో వయా డోండ్, గుంతకల్, అరక్కోణం, ఛంగల్‌పట్, మధురై, రామ్‌నాడ్, ధనుష్కోటి వరకూ రైల్లో వచ్చారు. అక్కడ నుండి సముద్రంలో ఫెర్రీలో శ్రీలంకలోని తలైమన్నార్, అక్కడ నుండి వేయంగోడాలో ఏర్పాటు చేసిన బసకు నవంబరు 4వ తేది ఉదయం 5.15కి చేరుకున్నారు. రుస్తుంజీ తన కుటుంబ సభ్యులందరితో వచ్చి, బాబా బృందానికి సాదరంగా స్వాగతం పలికాడు.

**ఆనాడు అవతారుని రాకతో వేయింగోడాలో ప్రకృతి పరవశించింది. కుండపోత వర్షం కురిసింది.** ఈ విశాలమైన బంగళాను పూర్తిగా బాబా కోసం కేటాయించాడు రుస్తుంజీ. బాబావారికి, ఆయనతో వున్న వారందరికీ అవసరమైన అన్ని ఏర్పాట్లు అక్కడ చేశారు. బాబా మెహెరాబాద్ వదిలి వెళ్తున్నారని చాలామంది ప్రేమికులు ఎన్నో దూరప్రాంతాల నుండి బాబా దర్శనం కోరుతూ వచ్చారు. ఐతే, వారికే కాదు, మెహెరాబాద్‌లో వుంటున్న స్థానిక బాబా ప్రేమిక కుటుంబాలకు కూడా బాబా దర్శనం అనుమతించ లేదు. బాబా ప్రయాణిస్తున్న రైలు మార్గంలో వచ్చే రైల్వే స్టేషన్లలో కూడా బాబా ప్రేమికులు ఎవరికి దర్శనం ఆనాడు అనుమతించలేదు. ఐతే, ధనుష్కోటి, తలైమన్నార్‌లో ఫెర్రీ ఎక్కేటప్పుడు, దిగే సమయంలో, అధికారిక అనుమతుల సమయంలో సంబంధిత అధికారులకు, వారి ప్రశ్నల పరంపరకు బాబా ఎక్కడా అభ్యంతరం చెప్పలేదు. కఠిన ఏకాంతవాసంలో బాబా వున్నప్పటికి స్థానిక చట్టాలను గౌరవించేవారని బాబా మండలి అభిప్రాయపడింది.

## వేయంగోడాలో బస తాత్కాలికమే

**ఐతే, వేయంగోడాలో బాబా బృందం ఎక్కువ రోజులు వుండలేదు. ఎందుకంటే, బాబా తన** ఏకాంతవాసం కోసం సముద్రతీరంలో అనువైన వసతి కోసం వెతకమని మరలా మండలిని ఆదేశించారు. అలా సరైన వసతి దొరకని పక్షంలో, ఏదైనా చిన్నకొండపై వున్న భవనం, ఆ కొండకు దగ్గరలో గల గలా పారే చిన్న సెలయేరు వుండాలని సూచించారు. ఆ సూచనల మేరకు ఎన్నో ప్రాంతాలు వెదికి, చివరాఖరిగా "కాండి"అనే అందమైన పట్టణంలో హెలొలూవా రోడ్డులో వున్న **"ప్రైమ్ రోజ్ హిల్ ఎస్టేట్"ను** ఎంపిక చేశారు. **ఆ పిదప, 1940 నవంబరు 16న బాబా బృందం వేయంగోడా ఎస్టేట్ నుండి ప్రైమ్ రోజ్** హిల్ ఎస్టేట్‌కు మారారు. ఈ ఎస్టేట్ కూడా నేటికీ ఎంతో అందంగా, దృఢంగా వుంది. మా పర్యటనలో ఈ బంగళాను కూడా సందర్శించాం, ఆ వివరాలు లోపలి పేజీల్లో...

**మెహెర్‌బాబా శ్రీలంకలో నిర్వహించిన విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమ వివరాలు లార్డ్ మెహెర్ మెహెరా మెహెర్ వాల్యూం – 2, మెహెర్‌బాబా జర్నల్, 1940 నవంబరు, సంపుటి 3, సంచిక 2 పేజి 121 ఛాన్జీ డైరీల శీర్షికలో అవతారుని శ్రీలంక పర్యటన విశేషాలు సవివరంగా అందజేశారు. వీలున్నవారు తప్పక చదవవల్సినది.**

## రెండవ రోజు - 2026 మార్చి 19, గురువారం
## కొలంబో నుండి అనురాధాపురకు

- **అనురాధాపుర యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు**
- **ఇది బౌద్ధులకు పుణ్యక్షేత్రం**
- **1940 నవంబరులో బాబా ఈ ప్రాంతాన్ని సందర్శించారు.**

**రెండవ రోజున కొలంబో నుండి పురాతన నగరం అనురాధాపురకు బయల్దేరాం.** ఈ ప్రాంతాన్ని బాబా 1940 నవంబరులో సందర్శించారు. అనురాధాపుర బౌద్ధ మతస్తులకు పవిత్ర పుణ్యక్షేత్రం. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన చరిత్రాత్మక పట్టణం. కొలంబో నుండి ఈ పట్టణం 200 కిమి దూరంలో వుంది. ప్రయాణ సమయం 5 గంటలు పైబడింది. ప్రతిరోజూ మా ప్రయాణం బస్సులోనే జరిగింది. ఇక్కడికి రైలు సౌకర్యం కూడా వుంది. ఈ ప్రాంతంలో రైలు ప్రయాణం కూడా ఓ చక్కని పర్యాటక ఆకర్షణగా చెప్తారు. కానీ, శతాధిక బృందంతో రైలు ప్రయాణమంటే సాధ్యమా?

**శ్రీలంక జనాభా రమారమిన రెండున్నర కోట్లు పైగా వుంటే, వారిలో 70 శాతం వరకూ** బౌద్ధ మతస్తులే. అనురాధాపుర పట్టణం రాజకీయంగా, మతపరంగా శ్రీలంక రాజధానిగా క్రీ. పూ. 4 శతాబ్దం నుండి క్రీ.శ. 993 వరకూ అంటే 13 శతాబ్దాల అనేక ఆటుపోట్లును ఎదుర్కొంటూ చరిత్రలో ఒక వెలుగు వెలిగింది. చోళ రాజుల ఆక్రమణతో ఈ ప్రాంతం కొన్నాళ్ళు తెరమరుగైంది.


అనురాధాపుర బౌద్దారామం చెంత




**అనురాధాపురలో ప్రధానంగా సందర్శించివల్సింది జయశ్రీ మహా బోధివృక్షం. ప్రపంచం లోనే అతి పురాతన వృక్షంగా గణుతికెక్కింది. 1940 నవంబరులో బాబా బృందం ఈ మహా బోధి వృక్షాన్ని సందర్శించారు.**

## ప్రపంచంలోనే అతి పురాతన వృక్షం

**క్రీ.పూ. 3వ శతాబ్దంలో, చక్రవర్తి అశోకుని కుమార్తె సంఘమిత్ర, బీహార్ రాష్ట్రంలో వున్న బౌద్ధ** గయలో వున్న మహా బోధి వృక్షంలోని ఒక కొమ్మను తీసుకొచ్చి ఆమె ఇక్కడ నాటారని, ఆ కొమ్మ నుండి దినదినాభివృద్ధి చెందినదే ఈ వృక్షం అని చరిత్రకారుల రాతలు తెలియజేస్తున్నాయి. సుమారు రెండు వేల సంవత్సరాల చరిత్ర గల ఈ మహా బోధి వృక్షం చూడటానికి యాత్రీకులు నిత్యం వందలాదిమంది వస్తున్నారు. బౌద్ధ గయలో వున్న ఈ చెట్టు కిందనే గౌతమ బుద్ధుడిగా సిద్దార్థునికి జ్ఞానోదయం అయిందని చెప్తారు. ఈ వృక్షం ఎన్నో తీవ్ర తుఫాన్లను ఎదుర్కొని నేటికీ చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోందని స్థానికుల కథనం. 1980వ దశకంలో శ్రీలంకలో సంభవించిన అంతర్యుద్ధంలో ఈ ప్రాంగణం కొంతమేర నష్టపోయిందని, దుండగులు కొందరు ఈ చెట్టు కొమ్మల్ని దొంగిలిం చినట్లు చరిత్రకారులు పేర్కొన్నారు. **ఏదిఏమైనా అత్యంత పురాతనమైన ఈ వృక్షాన్ని రాబోయే తరాల వారి కోసం అనేక విధాల** పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నారు స్థానిక ఆలయ అధికారులు. ప్రపంచంలోనే అతి పురాతన వృక్షం అని యునెస్కో సంస్థ ప్రకటించింది. ఈ మహా వృక్షంతోపాటు దగ్గరలోనే వున్న బౌద్ధుల పుణ్యక్షేత్రాలను సందర్శించి, ఆ రాత్రికి అనురాధాపురలో బస చేశాం.

## తలైమన్నార్ - రామసేతు సందర్శన
## మూడవ రోజు - 2026 మార్చి 20, శుక్రవారం



**- శ్రీరాముడు రావణ రాజ్యంలో తొలి అడుగుపెట్టిన ప్రాంతం - తలైమన్నార్**
**- ఈ అవతారకాలంలో మెహెర్‌బాబా తన మండలితో 1940 నవంబరులో**
**- తలైమన్నార్‌లో తన తొలి పాదం మోపారు.**

**మా యాత్రలో మూడవ రోజున హిందూ మహా సముద్ర తీరాన వున్న 'తలైమన్నార్'కి మధ్యాహ్నం 12 గంటల** తర్వాత చేరుకున్నాం. మార్చి నెల ఎండలు. భానుడు నిప్పులు చేరిగాడు. సముద్ర తీరాన్ని చూస్తే ఎవరైనా వయస్సు మరచిపోతారు కదా. మా బృందం లోని వయోధికులు ఇందుకు మినహాయింపు కాదు. అందరూ సముద్ర జలాలను తమ తలలపై ప్రోక్షించుకున్నారు. విభిన్న భంగిమల్లో ఫోటోలు తీసుకున్నారు.

**రామాయణంలో శ్రీరాముడు వానరసేన సహాయంతో ధనుష్కోటి నుండి తలైమన్నార్ వరకూ** వారధి నిర్మించుకుని రావణ రాజ్యంలో తొలి అడుగుపెట్టిన సంగతి పాఠకులకు తెలుసు. ఈ బ్రిడ్జి అభూత కల్పన అని కొట్టిపారేసిన వాళ్ళూ లేక పోలేదు. ఐతే, శాస్త్రవేత్తలు ఇది అవాస్తవం కాదని రుజువు చేశారు. దీన్ని నేడు ఆడమ్స్ బ్రిడ్జి అనీ పిలుస్తున్నారు.

### ఈ అవతారకాలంలో

**ఈ సముద్రతీరం చాలా విశేషమైంది. మన దేశంలో తమిళనాడు రాష్ట్రంలో వున్న రామేశ్వరం** దాకా రైలు–రోడ్డు సర్వీసులు అందుబాటులో వున్నాయి. రామేశ్వరానికి సుమారు 6 కిమీ దూరంలో వున్న ధనుష్కోటి వరకూ రోడ్డు సౌకర్యం మాత్రమే వుంది.



## సముద్ర సంగమం

**ధనుష్కోటి తర్వాత అంతా సముద్రమే.** ఇక్కడి దాకా భారతదేశ సరిహద్దు. ఆపై శ్రీలంక సరిహద్దులు ప్రారంభ మౌతాయి **ఇంకొకమాట. ధనుష్కోటి దగ్గర బంగాళా ఖాతం, తలైమన్నార్ నుండి వచ్చిన హిందూ మహా సముద్రం ధనుష్కోటి దగ్గర కలుస్తాయి.** బంగాళాఖాతంలో జలాలు నీలి రంగులో, తక్కువ అలలతో వుంటాయి. హిందూ మహా సముద్రపు నీరు లేత ఆకుపచ్చ రంగులో, పెద్ద పెద్ద అలలతో ఉధృతంగా వుంటాయి.

**ధనుష్కోటి దగ్గర ఈ రెండు మహా సముద్రాల సంగమాన్ని స్పష్టంగా యాత్రీకులు చూడొచ్చు. ఈ సముద్ర సంగమం నుండి** తలైమన్నార్ సుమారు 30 కిమీ దూరంలో వుంది. ధనుష్కోటి – తలైమన్నార్‌లనడుమ ఫెర్రీ సర్వీసు 1980వ దశకం వుండింది. ఐతే, నేడు ఈ సౌకర్యం లేదు. ధనుష్కోటి నుండి శ్రీలంకకు పర్యటించే యాత్రీకులు తలైమన్నార్ వరకూ సముద్రంలో ఫెర్రీలో వచ్చి, అక్కడ నుండి రైలు సౌకర్యంతో కొలంబోకు చేరుకునేవారు. ఐతే, 1983లో శ్రీలంకలో తలెత్తిన సివిల్ వార్ పిదప ధనుష్కోటి – తలైమన్నార్‌ల నడుమ ఫెర్రీ సర్వీసుల్ని నిలిపివేశారు. **రాత్రి సమయంలో, విద్యుత్ కాంతుల్లో ధనుష్కోటి తీరాన్నుంచి చూస్తే శ్రీలంక దేశం ఒక కన్నీటి బొట్టు మాదిరిగా కనిపిస్తుందని చెప్తారు సాహిత్యకారులు.**

**కాగా, 1940 నవంబరు ఒకటిన కలియుగావతారుడు మెహెర్‌బాబా బృందం ధనుష్కోటి నుంచి** తలైమన్నార్ వరకూ ఫెర్రీలో వచ్చి, ఆ పిదప వేయంగోడాలో ఏర్పాటు చేసిన బసకు చేరుకున్నారు. **ఈ అవతారకాలంలో, మెహెర్‌బాబా ఏకాంతవాసంలో భారీ ప్రేమిక** బృందంతో 1940 నవంబరులో తొలుతగా శ్రీలంక భూభాగంపై తన తొలి అడుగు తలైమన్నార్ నుండే ప్రారంభించారు. మేం తలైమన్నార్ చేరుకున్నాక, ఆనాటి బాబావారి మధురస్మృతులు జ్ఞాపకం చేసుకుని, అవతారుని ప్రార్థనల పఠించి, సముద్ర తీరాన వున్న ఆనాటి నిర్మాణాలు చూసి, మా తదుపరి పర్యటన ప్రదేశమైన డాంబుల్లాకి బయల్దేరాం. ఆ రాత్రికి డాంబుల్లాలో బస చేశాం.

***

## నాల్గవ రోజు - 2026 మార్చి 21, శనివారం - డంబుల్లా, సింగిరియా

**– డంబుల్లాలో గోల్డెన్ బుద్ధ టెంపుల్, సింగిరియా చరిత్రాత్మక రాతికోట సందర్శన,**
**- 1940 నవంబరులో మెహెర్‌బాబా బుద్ధుని దేవాలయాన్ని సందర్శించారు**
**- ముందుగా, శాకంబరి శక్తి పీఠాన్ని దర్శించుకున్నాం**




**డాంబుల్లా అందమైన పట్టణం. ఇక్కడ** ఎత్తైన పీఠంపై సుమారు 30 మీటర్ల ఎత్తు గల గోల్డెన్ బుద్ధ విగ్రహం ఆకర్షణీయంగా వుంది. ఇక్కడ వున్న రాతి గుహలలో సుమారు 50 అడుగుల పొడవున పడుకుని వున్న గౌతమ బుద్ధుని రాతి శిల్పం, రాతి గుహల గోడలపై చిత్రించిన రంగుల చిత్రాలు గత 22 శతాబ్దాలుగా యాత్రీకులను ఆకర్షిస్తున్నాయని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

**1940 నవంబరులో మెహెర్‌బాబా** డాంబుల్లాలోని ఈ దేవాలయాన్ని తన మండలి సభ్యులతో సందర్శించారు. ఈ రాతి గుహలు చిన్న ఎత్తైన కొండపై వున్నాయి. అందువల్ల మాలో చాలా మంది క్రింద నుండే మనసారా నమస్కరించుకున్నాం. ఈ ఆలయానికి 1991 సంవత్సరంలో యునెస్కో సంస్థ ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది. ఇక్కడ బాబా నామస్మరణ అనంతరం, **అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శాకంభరి దేవాలయాన్ని సందర్శించాం.**

**డాంబుల్లా నుంచి ఈ దేవాలయం సుమారు 100 కిమీ దూరంలో వుంది. ముందుగా ఈ** దేవాలయ దర్శన కార్యక్రమం మా ప్రోగ్రాంలో లేదు. కొంతమంది ఈ అంశాన్ని లేవనెత్తుతూ, ఇంత దగ్గరగా వచ్చాక, శక్తి పీఠాన్ని సందర్శించపోతే ఎలా అన్నారు. కొంతమంది మాకిష్టం లేదన్నారు. ఇష్టమున్నా లేకున్నా వెళ్ళాల్సిందేనని పెద్దలు నిర్ణయించారు.


శక్తి పీఠం దగ్గర

అలా ఇష్టాయిష్టాలకు అతీతంగా అందరూ దేవళానికి క్యూ కట్టారు. కొందరు అర్చనలు, పూజలు చేయించారు పట్టు వస్త్రాలు భక్తితో సమర్పించారు మరికొందరు. ఈ దేవాలయం ఎత్తైన కొండ మీద వుంది. కొండ దిగువ నుండి ఆటో రిక్షాల్లో ఆలయానికి వెళ్ళాలి. కొండ దిగువున హిందూ మహా సముద్ర తీరం వుంది. సుమారు రెండు వేల సంవత్సరాల చరిత్ర గల ఈ దేవాలయానికి రావణ, విభీషణుల కాలంలో ఎంతో వైభవంగా విరాజిల్లిందని చరిత్రకారులు రాతలు తెలియజేస్తున్నాయి. చోళ, పాండ్య, పల్లవ రాజులు ఆలయ అభివృద్ధికి ఇతోధికంగా సహకరించారు. ఐతే, శ్రీలంకను ఆక్రమించిన పోర్చుగీసుల పాలనలో ఈ దేవాలయంలో చాలా భాగం ధ్వంసమయ్యిందని, 1948లో శ్రీలంకకు స్వాతంత్ర్యం సిద్ధించాక ఆలయ పునర్నిర్మాణం జరిగి, పూర్వవైభవం సంతరించుకుందని ఆలయ ప్రాంగణంలోని శిలాఫలకాలు తెలియజేస్తున్నాయి.

## సిగిరియా రాతి కోట

**అనంతరం, డాంబుల్లాలోని చారిత్రక రాతి కోట సిగిరియాను సందర్శించాం. దీన్ని "సింహగిరి" (లయన్ రాక్) అని కూడా పిలుస్తారు.** ఇది భూమి నుండి 600 అడుగుల ఎత్తులో ఒళ్ళు గగుర్పొడిచే విశేషాలతో వున్న చరిత్రాత్మక రాతి కోట. మరో రకంగా చెప్పాలంటే శిథిలాల సముదాయంగా వున్న ఒకప్పటి రాజప్రాసాదం. ఈ కొండపైకి ఎక్కేందుకు


సిగిరియా కొండ దగ్గర

ముందుగా, ఎత్తైన సింహం రూపంలో ఒక ద్వారాన్ని నిర్మించారు. అందుకే దీన్ని సింహగిరి అని పిలుస్తారు. కశ్యప మహారాజు 5వ శతాబ్దంలో ఈ కోటను నిర్మించారని చారిత్రక రచనలు తెలియజేస్తున్నాయి. 1982లో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా యునెస్కో ప్రకటించింది. శ్రీలంక వచ్చే అధిక శాతం పర్యాటకులు సిగిరియాకు తప్పక వస్తారు.

**ఈ కోటని దగ్గరగా దర్శించుకోవాల్సింది. సమయాభావం వెంటాడుతుండటంతో, ఫోటోలు** తీసుకుని పొలోమని బస్సు ఎక్కేసాం. కోట శిఖరాగ్రానికి చేరుకోవడానికి సుమారు 1200 మెట్లు ఎక్కాల్సి వుంటుంది. ఎస్కలేటర్లు వంటి ఆధునిక సౌకర్యాలు ఏమీ లేవు. సిగిరియా నుండి కాండి పట్టణానికి బయల్దేరాం. ఆ రోజు రాత్రి బస కాండిలోనే.

## మా బస

**కాండీలో మా బస ఏర్పాటు కూడా ఒక ఎత్తైన కొండ చివరన నిర్మించిన నాలుగు నక్షత్రాల హోటల్‌లో ఏర్పాటు చేశారు.** హోటలు దాకా మా బస్సులు వెళ్ళవన్నారు. ఈ రహదారి బహు సన్నగా వుంది. సన్నని రహదారుల్లో సుమారు వెయిన్నర అడుగుల ఎత్తులో ప్రయాణించడం కష్టమన్నారు. అందుకోసం, ప్రత్యేకంగా, ట్వెంటీ సీటింగ్ మినీ బస్సులు ఏర్పాటు చేశారు. ఆ హోటలు పేరు ఏమో గుర్తులేదు కానీ, సన్నని రోడ్లపై, గిరిగిరా, ప్రతి రెండు నిముషాలకు ఒక మలుపు త్రిప్పుతూ, కొండ పైభాగన వున్న స్టార్ హోటల్‌కు చేరుకున్నాం. ఇక హోటల్లోని హంగులు గురించి ప్రత్యేకంగా చెప్పాలా?



కాండి హోటలు ప్రాంగణంలో

## ఐదవ రోజు – 2026 మార్చి 22 కాండి పట్టణం

– కాండి పట్టణం గురించి ఎంత చెప్పినా తక్కువే.
– అంటే, అంత అందమైన ప్రాంతం.
– కాండి నాకు మెహెరాబాద్ లాంటిదన్నారు మెహెర్‌బాబా.
– బాబా కాండిలో నవంబరు 16 నుండి డిసెంబరు 1 వరకూ, అంటే 16 రోజులు బాబా – ఇక్కడ బస చేశారు. బాబా ఇక్కడ ఏకాంతవాసం, మస్తుల సాంగత్యం చేశారు
– బాబా బస చేసిన 'ఫ్రైమ్ రోజ్ ఎస్టేట్', నేటికీ సందర్శకులకు అందుబాటులో వుంది.
– నవంబరు 23న కాండికి 'బ్లూ బస్' చేరుకుంది
– బాబా తన మండలితో కలిసి ఇక్కడ పలు పర్యాటక ఆకర్షణలు సందర్శించారు
– ఇంకా.. ఎన్నో విశేషాలు గల కాండి పట్టణ సందర్శన గురించి,
– ఆసాంతం చదవండి ఆసక్తిగా

**శ్రీలంకలోని రెండవ అతిపెద్ద నగరం కాండి. ఈ నగరం చుట్టూతా ఎత్తైన కొండలు,** దట్టమైన అటవీ ప్రాంతం ఎక్కువగా వుంది. ఈ నగరం సముద్రమట్టానికి రమారమిన రెండు వేల అడుగుల ఎత్తులో వుంది. ఇక్కడ వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా వుంది. డిసెంబరు, జనవరి నెలలో తీవ్ర చలిగాలులతో పాటు, వర్షపాతం కూడా ఎక్కువగా నమోదవుతుంది.

**కాండి పట్టణం గురించి ఎంత చెప్పినా తక్కువే. అంటే, అంత అందమైన ప్రాంతం కాండి.** అవతారుడు మెచ్చిన పట్టణం కాండి. బాబా తన మండలి బృందాన్ని కాండి పట్టణంలో వున్న పలు పర్యాటక ప్రదేశాలకు స్వయంగా తీసుకెళ్ళిన ఆధారాలు మెహెరా మెహెర్ గ్రంథం ద్వారా తెలుస్తోంది.

**మెహెర్‌బాబా తన బృందంతో ఈ ప్రాంతాన్ని 1940 నవంబరులో సందర్శించారు. ఆనాడు,** ప్రతిరోజూ వానలు, తీవ్ర చలిగాలితో ఈ ప్రాంతం స్విట్జర్లాండులా వుందన్నారు బాబా.

**కాండిలో చూడవల్సిన పర్యాటక ఆకర్షణలు ఎన్నో వున్నాయి. అన్నింటికన్నా మిన్నగా** గౌతమ బుద్ధుని దంతం (పన్ను) నొకదాన్ని ఇక్కడున్న బౌద్ధారామంలో భద్రపరిచారు. బంగారు పేటికలో ఆ దంతాన్ని వుంచి, సందర్శకులకు అందుబాటులో వుంచారు. వందలాది బౌద్ధ బిక్షకులతో ఈ ప్రాంగణం చాలా సందడిగా వుంది.




## ప్రైమ్ రోజ్ ఎస్టేట్ సందర్శన

**అనంతరం, కాండి పట్టణానికి సుమారు 2 కిమీ దూరంలో వున్న ప్రైమ్ రోజ్ ఎస్టేట్‌కు** బయల్దేరాం. మెహెర్‌బాబా వేయంగోడా బంగళా నుండి కాండికి 1940 నవంబరు 16వ తేదీన విచ్చేశారు. బాబా బృందం కాండిలో ప్రైమ్‌రోజ్ ఎస్టేట్‌లో బస చేశారు.

**85 సంవత్సరాల తర్వాత కూడా, ఆనాటి ఈ బంగళా చెక్కుచెదర లేదు. చుట్టూ పూలతోట లతో** నిండి వుంది. ఎత్తైన కొండ సానువుల్లో వుందీ బంగళా. సన్నని రోడ్లలో చిన్న వ్యాన్‌లలో బంగళాకు చేరుకున్నాం. మెలికలు తిరిగే సందుల్లో, వయోధికులకు ఈ రహదారి ఇబ్బందికరంగానే వుంది. ఏదేమైనా, చివరాఖరున బంగళా ప్రాంగణం అత్యద్భుతంగా, ఆహ్లాదకరంగా వుంది. చాలా ప్రశాంతంగా, విశాలంగా వుంది. నూరుమందికి పైగా యాత్రీకులు ఒక్కసారి సమావేశమయ్యేందుకు వీలుగాఈ ప్రాంగణం వుంది.

**ఈ మాటల్ని బాబావారి సోదరి మణిజా తన డైరీలో కూడా ఉటంకించారు. బాబావారి** పాదస్పర్శతో పునీతమైన ఈ ప్రాంగణంలో బాబా ప్రార్థనలు పఠించి, ఆ ప్రాంత విశేషాలు మరోమారు గుర్తుచేసుకున్నాం. **ఆ విశేషాలు ఇలా వున్నాయి.**



## కాండిలో మెహెర్‌బాబా

**1940 నవంబరు 4వ తేది ఉదయం** బాబా వారి మండలి బృందం శ్రీలంకలోని తలైమన్నార్‌కు చేరుకుని అక్కడ నుండి వేయంగోడా ఎస్టేట్‌లో నవంబరు 4 నుండి 15వ తేదీ వరకూ బస చేశారన్ని సంగతి పాఠకులకు గుర్తుండే వుంటుంది. ఐతే, బాబా తన ఏకాంతవాసం కోసం మరేదైనా అనువైన ప్రాంతం వెదకమని మండలివారికి సూచించారు. అనువైన ప్రాంతం ఎలా వుండాలో చెబుతూ, ఆ ప్రాంతం సముద్రతీరానికి దగ్గరగా వుండాలన్నారు. అటువంటి వసతి దొరకని పక్షంలో, ఏదైనా చిన్న కొండ ప్రాంతాన్ని అన్వేషించమన్నారు. ఆ కొండకు దగ్గరలో గలగలా పారే చిన్న సెలయేరు వుండాలని సూచించారు. **ఎన్నో ప్రదేశాలు వెదికి, చివరిగా, "కాండి"** నగరానికి సమీపంలో, హెులొలూవా రోడ్డులో వున్న ప్రైమ్ రోజ్ హిల్ ఎస్టేట్‌ను ఎంపిక చేశారు. కాండి పట్టణం చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ప్రశస్తి చెందిన ప్రాంతం. ఇక్కడ పరిసరాలలో టీ తోటల గుభాళింపు వుంది. చుట్టూతా ఎత్తైన కొండలు, పచ్చని వృక్షాలతో ప్రశాంతంగా వుంది. ఇక్కడ ఎత్తైన కొండ కింద గలగల పారే నీటి వ్యాలీ వుంది.

**దాంతో ఈ ప్రాంతం బాబావారికి బాగా నచ్చింది. నవంబరు 16న ఈ నూతన భవన ప్రాంగాణానికి, మస్తు - చట్టిబాబాతో సహా స్త్రీ, పురుష మండలి అందరూ ఇక్కడకు మారారు.** ఇక్కడ వున్న కొండపై బాబా కోసం చిన్న కాటేజి నిర్మించారు. కొండ దిగువున స్త్రీ మండలి వారున్నారు. ఈ పర్యటనలో బాబా ఎప్పటిలా మస్తుల సాంగత్యం చేశారు.

**ఇది ఇలా వుండగా నవంబరు 23న మెహెరాబాద్ నుండి కాండికి బ్లూ బస్ చేరుకుంది.** బ్లూ బస్‌లో కాండికి సమీపంలోని దంబుల్లా, అనురాధాపురాలలో వున్న మహా బోధి వృక్షం, అలాగే, బుద్ధునికి సంబంధించిన పలు దర్శనీయ స్థలాలను బాబా బృందం సందర్శించారు.



**1940 డిసెంబర్ 1వ తేది ఆదివారం నాడు బాబా తన ఏకాంతవాస కార్యక్రమం చాలా** చక్కగా జరిగిందని ప్రకటించారు. ఆపై ఇక్కడ నుండి భారతదేశానికి తిరిగి బయల్దేరదామని అన్నారు. కాండీలో మూడు నెలలకు ప్రైమ్ రోజ్ బంగళాను బాడుగకి తీసుకున్నారు. ఐతే, తాము వచ్చిన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది కాబట్టి, ఇక్కడ్నుంచి తక్షణం బయల్దేరదామన్నారు బాబా.

**ఐతే, శ్రీలంక నుంచి మెహెరాబాద్‌కి కాకుండా, ఇక్కడ్నుంచి తిన్నగా మలబార్ ప్రాంతానికి వెళ్దామన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు నిమిత్తం మండలి వారు కేరళ రాష్ట్రానికి ముందుగా బయల్దేరారు. ఈ అవతారకాలంలో దేవదేవుని మాటలన్నింటినీ మరోమారు మననం చేసుకుని, కాండి నుండి బండారవేల పట్టణానికి బయల్దేరాం. ఆ రాత్రికి బండారవేలలో మా బస. బాబా ప్రేమికులకు బండారవేల చాలా ముఖ్యమైన యాత్రాస్థలం. ఇక్కడ బాబా మా బృందానికి మరచిపోలేని ఒక అవకాశం ఇచ్చారు. అ వివరాలు త్వరలో చదువుకుందాం!**

## శ్రీలంక

**1970వ దశకం వరకూ శ్రీలంకను సిలోన్‌ని అని పిలిచేవారు. శ్రీ – దివ్యమైన, లంక అంటే ద్వీపం అని అర్థం. శ్రీలంక చారిత్రక నగరం. హిందూ మహా సముద్రంలో చిన్న ద్వీపం. దేశ జనాభా రెండున్నర కోట్లు. బౌద్ధ మతానికి కేంద్ర బిందువుగా చరిత్రలో భాసిల్లింది. రెండవ ప్రపంచ యుద్ద సమయంలో (1939 –1945) సిలోన్ ప్రధాన కేంద్ర స్థావరంగా వుంది. ఈ దేశానికి 1948లో స్వాతంత్ర్యం వచ్చింది.**

## ఆరవ రోజు - 2026 మార్చి 23
## 1933 జనవరిలో బాబా బస చేసిన - బండారవేల






బండారవేలా హోటలు పోర్టికోలో

## 132 సంవత్సరాల చరిత్రగల బండారం

**బండారవేల పట్టణంలో బాబా బస చేసిన హోటలు పేరు కూడా హోటల్ బండారవేలా. 1893లో** ఈ హోటల్‌ని స్థాపించినట్లు హోటల్ ప్రాంగణంలో వున్న సైన్‌బోర్డు ద్వారా తెలుస్తోంది. 1894 ఫిబ్రవరిలో కదా అవతారుడు జన్మించింది. ఆ మాట అలా వుంచితే, 132 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న ఈ హోటల్ని నేటికీ ఎంతో పరిశుభ్రంగా, హుందాగా నిర్వహిస్తున్నారు. పురాతన, వారసత్వ, చారిత్రక ఆధారాలను చెరిపివేయని రీతిలో ఒక శతాబ్దానికి పైగా వీరు హోటల్‌ని నిర్వహిస్తున్నారు. విశేషం కదండి. చాలా అరుదుగా కనిపిస్తుంది ఈ మాదిరి నిర్వహణ.

## బండారవేలలో ఊహకందని అవకాశం

**సాధారణంగా అవతారుడు బస చేసిన హోటలు బైట నిల్చుని, బాబాని నామాన్ని స్మరించడం ఒక ఆనవాయితీగా జరుగుతోంది ఇన్నాళ్ళుగా. కానీ బండారవేలలో ఒక అరుదైన, ఊహకందని అవకాశం మా అందరికీ చిక్కింది.**

అదేమంటే, అవతారుడు బస చేసిన ఈ హోటల్లో మా బృందంలోని వారందరికీ 2026 మార్చి 22న ఒక్కరోజు ఇక్కడ బస చేసే అవకాశం చిక్కింది. ఇది ఏ మాత్రం యాదృచ్ఛికం కాదని, బాబా ప్రేమికుల నమ్మకం. ఈ హోటల్‌లో 25 డబుల్ బెడ్‌రూమ్‌లు మాత్రం వున్నాయి. అందుకని, మా నూరుమందిలో సగం మందికి మార్చి 22న, మిగిలినవారు ఆ మర్నాడు, మార్చి 23న ఇక్కడ బస చేశారు. బండారవేల వారి ఆతిథ్యం కూడా బ్రహ్మాండంగా వుంది.

## మెహెరీశుడు బండారవేలలో

**1933 జనవరిలో యూరోపు పర్యటన ముగించుకుని సముద్రయానంలో భారత్‌కు తిరిగి వస్తూ,** మార్గమధ్యంలో బాబా తన మండలితో కలిసి కొలంబోలో ఆగారు. ఆ వేళ 1933 జనవరి 12, గురువారం. కొలంబోలో **వైట్ హార్స్ అనే హోటల్‌లో** మూడు రోజులు బస చేశారు. ఆ పిదప జనవరి 15న, కొలంబోకి సమీపంలోని బండారవేల పట్టణంలోని హోటల్ బండారవేలాలో ఒకరోజు బస చేశారు. ఆ తదుపరి, ఇక్కడకు సమీపంలోని కొండపై వున్న 'విల్లా వాలెన్సియా' బంగళాలో బాబా బస చేశారు. (ఈ హోటల్‌ని గుర్తించడం కష్టమయ్యింది).

**బండారవేల ఒక ప్రకృతి రమణీయ ప్రదేశం. సముద్ర మట్టానికి 5000 అడుగుల ఎత్తులో** వుంది ఈ పట్టణం. ఇది యూరోపులోని స్విట్జర్లాండ్ మాదిరిగా వుందన్నారు బాబా.

**యూరోప్‌లోని అసిసీలో మాదిరి ఇక్కడ తాను 24 గంటలు ఏకాంతవాసంలో వుండాలని** వుందని కాకా బారియాతో బాబా అన్నారు. అందుకు అనువైన ప్రదేశం బండారవేలాలో దొరుకుతుందేమో చూడమన్నారు. క్వెంటిన్ అనే మరో పాశ్చాత్య ప్రేమికుడు కూడా ఆనాడు బాబాతో వున్నాడు. **ఆ వేళ 19.1.1933.**

**ఇక్కడ ఒక ఇరుకైన వీధి చివరిలో బుద్ధుని ఆలయం బాబావారికి బాగా నచ్చింది. ఐతే, ఆ** దేవాలయ అర్చకుడు బాబాని ఆ ఆలయంలో ఏకాంతవాసం వుండటానికి అంగీకరించ లేదు. దాంతో అక్కడ నుంచి బైటకు వచ్చేశారు. ఇంతలో ప్రక్కనే వున్న ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. అందులో నుంచి సుమారు 100 సంవత్సరాల వయస్సు వున్న వృద్ధుడొకరు బయటకు వచ్చాడు. అతను బాబావారిని చూస్తూనే గుర్తుపట్టాడు. అతను



సంజ్ఞలు చేస్తూ ఏం కావాలని బాబాని అడిగితే, “తాను ఈ ప్రాంతంలో 24 గంటలు ఏకాంతవాసం గడపాలను కుంటున్నాను. అందుకు అనువైన గది చూపించమని” బాబా సంజ్ఞలు చేశారు. ఆ వృద్ధునికి బాబా ఏమి అడుగుతున్నారో బోధపడింది. వెంటనే గుడి తలుపులు తెరిచి బాబావారికి గదిని కేటాయిం చమని ఆలయ పూజారిని ఆజ్ఞాపించాడు ఆ వృద్ధుడు.

**ఐతే, అంతలోనే బాబా తన మనస్సు మార్చుకున్నారు. అక్కడ్నుంచి ముందుకు వెడదామన్నారు.** అంతేకాదు, ఈ వృద్ధుడు నాల్గవ భూమికలో వున్నాడని బాబా ప్రకటించారు. ఈతను ఈ ప్రాంతంలో వున్న తన ఏజెంటు అని పేర్కొన్నారు. తాను శ్రీలంక వదిలి వెళ్ళేలోగా అతనికి ఐదవ భూమిక ప్రసాదిస్తానన్నారు. ఆధ్యాత్మికంగా ముందంజలో వున్న ఈ వృద్ధుడ్ని కలవడం కోసమే ఏకాంతవాసం మిషతో బాబా ఇక్కడకు వచ్చారా? అనిపించింది మండలి వారికి!

## సీతమ్మ అగ్నిప్రవేశ స్థలం

**ఈ ప్రాంగణాన్ని మార్చి 24న మేం సందర్శించాం. నేడిక్కడ బౌద్ధ ఆరామం, ఆ ప్రక్కనే** సీతమ్మవారి ఆలయం ఒకే ప్రాంగణంలో వున్నాయి. శ్రీమద్రామాయణంలో శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించాక, సీతమ్మ అగ్నిప్రవేశ ఘట్టం జరిగింది. ఆ సంఘటన జరిగింది ఇక్కడేనని స్థానిక ఆలయ పూజారి సవివరంగా తెలియజేశాడు. రామ–రావణ యుద్ధం జరిగిందీ ఇక్కడికి సమీపంలోనే అని చెప్పాడు ఆ పూజారి. రామాయణ కాలం నాటి ఎన్నో విశేషాలు తెలియజేస్తూ ఇక్కడ ఏర్పాటు చేసిన సీతమ్మవారి ఆలయాన్ని చూపించాడు. అక్కడ సీతమ్మకు బాబా ప్రేమికులు ప్రణమిల్లారు. పురుషులు ఆమె విగ్రహాన్ని తాకరాదన్నారు. ఐతే, కొంతమంది బాబా ప్రేమికులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తెలియని అనుభూతి పొందారు. కొందరికి కళ్ళు చెమర్చాయి. సీతమ్మవారి దేవళం చాలా నిరాడంబరంగా వుంది.

## సగటు ప్రేమికుల తరమా



**1933 జనవరి 19న బాబావారు సందర్శించిన** బుద్ధుని ఆలయ ప్రాంగణం ఇదే అయివుంటుం దన్నారు మాలో కొందరు. బాబావారు కలిసిన నాల్గవ భూమికలోని వృద్ధుడు కూడా ఇక్కడేమోననే ఆలోచన పలువురిలో మెదిలింది. ఆనాడు అవతారుని సమక్షంలో జరిగిన సంఘటన కచ్చితంగా ఇక్కడే అనేవాళ్ళూ మాలో వున్నారు. ఏమో! **అవతారుని పనితీరు సగటు ప్రేమికులందరికీ అర్థమవుతాయా!!**

**బండారవేలలో 1933 జనవరి 26న "సిలోన్ అబ్జర్వర్" అనే స్థానిక దిన పత్రిక ప్రతినిధికి బాబా** ఇంటర్వ్యూ ఇచ్చారు. అతను అడిగిన అనేక ప్రశ్నలకు సావధానంగా జవాబిచ్చారు బాబా. బాబా అతనితో మాట్లాడుతూ, "సిలోన్ చాలా అందమైన దేశం అన్నారు. నేను తిరిగి మరోమారు ఇక్కడకు వస్తానన్నారు". ఆ పిదప బాబా తన మండలితో కలిసి 1933 జనవరి 27న బండారవేల నుంచి కొలంబో వెళ్ళారు. జనవరి 29న కొలంబోలో బాబా కఠిన ఏకాంతవాసంలో గడిపారు. ఆ మర్నాడు కొలంబో నుండి సముద్రయానంలో ఇండియాకు తిరుగు ప్రయాణమయ్యారు. బాబా తాను తిరిగి శ్రీలంక వస్తానని ఇచ్చిన మాట ప్రకారం, 1940 నవంబరులో ఇక్కడకు వచ్చారని మండలివారి నమ్మకం.

## లిప్టన్ సీట్

**మేం బండారవేలా నుండి బయల్దేరి దగ్గర్లోనే వున్న లిప్టన్ సీట్ – టీ తోటలకు వెళ్ళాం. ఇది** చాలా కష్టమైన రహదారి. చాలా ఇరుకైన ఘాట్ రోడ్డు. సముద్ర మట్టానికి 6000 అడుగుల ఎత్తులో వుంది. శ్రీలంక వారికి టీ తోటల పెంపకాన్ని పరిచయం చేసింది ఈ లిప్టన్ మహనీయుడేనని, ఈయన స్మృతిగా ఎత్తైన కొండపై చిన్న పర్యాటక ఆకర్షణ అభివృద్ధి చేశారు. ఇక్కడ అందరూ ఫోటోలు తీసుకున్నారు. అనంతరం ఇక్కడ నుండి బయల్దేరి మార్గంలో వున్న రావణ వాటర్ ఫాల్స్, నైన్ ఆర్చ్ రైల్వే బ్రిడ్జి సందర్శించాం. ఐతే, ఈ రెంటినీ స్కిప్ చేసినా ఫరవాలేదనిపిస్తుంది. హైదరాబాద్‌లోని మూసీపై వున్న పురానాపూల్‌ని తలపిస్తుంది నైన్ ఆర్చ్ బ్రిడ్జి. ఆ రాత్రికి న్యూ వారా అనే పట్టణంలో బస చేశాం. ఆ వివరాలు ప్రక్కపేజీలో...

## ఏడవ రోజు - 2026 మార్చి 24, మంగళవారం
## న్యూవారా ఏలియా - లిటిల్ ఇంగ్లాండ్




**న్యూవారా ఏలియాలో సీతా ఏలియా అనే ప్రాంతానికి వెళ్ళాం. ఇక్కడి రావణ రాజ్యంలో సీతమ్మవారిని అపహరించి వుంచిన** అశోక వనం ప్రాంతాన్ని చూపించారు. నేడిక్కడ సీతారామ లక్ష్మణుల ఆలయం వుంది. అశోక వనంలో వున్న సీతమ్మ వారిని తొలిసారిగా దర్శించిన హనుమంతుని పాదముద్ర ఇదిగో! అని ఆలయ వెనుక భాగంలో ఒక బండ రాయిపై పాదముద్రని చూపించారు. ఇదంతా ఎత్తైన కొండ ప్రాంతం. దట్టమైన వృక్షాలతో నిండి వుంది. ఇక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. ఈ ప్రాంతాన్ని లిటిల్ ఇంగ్లాండ్ అని పిలుస్తారని చెప్పారు.

**ఆ పిదప ఇక్కడ నుంచి టీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌కి వెళ్ళాం. టీ తోటల పెంపకం,** టీ పొడి తయ్యారీ, ప్యాకింగ్‌ల పని విధానం వివరించి, యాజమాన్యం చక్కని తేనీరు అందజేశారు. ఆ రాత్రికి బెంటోడా అనే పట్టణంలో సముద్ర తీరాన వున్న హోటల్‌లో బస చేశాం.

## ఎనిమిదవ రోజు –2026 మార్చి 25, బుధవారం



### గాలే పట్టణంలో డచ్ పాలకుల కోట – కొలంబోలో బస

మా పర్యటనలో ఆఖరి రోజైన మార్చి 25, గురువారం నాడు బెంటోడా నుంచి గాలె పట్టణానికి చేరుకున్నాం. ఇది డచ్ దేశీయుల పాలనా కాలంలలో నిర్మించిన ఒక రాతికోటను నేడు వారసత్వ కట్టడంగా తీర్చిదిద్దారు. కోట లోపల పలు అధికార, ప్రైవేటు కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. అక్కడ ఇలా అవీ–ఇవీ అన్నీ చూసి, అలసి పోయి రాత్రికి శ్రీలంక రాజధాని పట్టణం కొలంబో చేరుకున్నాం. ఇక్కడ ఒక వూరి నుంచి మరో పట్టణం చాలా దూరంగా వున్నాయి. సన్నని రోడ్లు. ఎత్తైన కొండలు. దానివల్ల ఎక్కువ సమయం దూర ప్రయాణాలకే పట్టింది. తప్పదు కదా!



## తొమ్మిదవ రోజు – 2026 మార్చి 26, గురువారం

ఈ వేళ ఉదయాన్నే హోటలు నుండి బయల్దేరి ముందుగా కొలంబో నగర సందర్శనలో భాగంగా వైట్ హార్స్ హోటల్‌కి చేరుకున్నాం. ఈ హోటలు ప్రత్యేకత ఏమంటే, **1933 జనవరిలో యూరోపు పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి వస్తూ మెహెర్‌బాబా** ఈ హోటల్ లోనే మూడు రోజులు బస చేశారు.



1933 జనవరి 12 నుండి 15 వరకూ బాబా ఈ హోటల్‌లో వున్నారు. జనవరి 15న కొలంబో నుండి బొంబాయికి ఓడలో బయల్దేరారు. **ఐతే, నేడు ఈ హోటల్‌ని 'నిప్పన్" హోటల్‌గా పేరు మార్చారు.** ఓడరేవుకి చేరువలో వున్న ఈ పెద్ద హోటల్ నేటికీ ఎందరికో ఆతిథ్యమిస్తోంది. అలాగే కొలంబోలో బాబావారు లంచ్ చేసిన హోటల్ విక్టోరియాను కూడా సందర్శించాం. నేడు ఈ హోటల్ని గ్రాండ్ ఓరియంటల్ హోటల్‌గా పేరు మార్చారు. ఈ విషయం స్థానిక హోటల్ యాజమాన్యం స్పష్టంగా తెలియజేసింది. **అనంతరం కొలంబో షాపింగ్ సెంటర్‌లో రెండు గంటలు గడిపి, లంచ్ ముగించుకుని,** ఎయిర్‌పోర్టుకి చేరుకున్నాం. రాత్రి తొమ్మిందింటికల్లా హైద్రాబాద్ చేరుకున్నాం.

## శ్రీలంకపై బాబా ఉవాచ

**ఆధ్యాత్మికంగా శ్రీలంకకి ఎలాంటి ప్రత్యేకత లేదన్నారు బాబా. అంతర్గతంగా కూడా శ్రీలంకకు** ఎలాంటి ఆధ్యాత్మిక ఛాయలు లేవన్నారు. సిలోన్ అంటే రావణాసురుని ఆవాసం. గట్టి రాతి కొండల సమాహారం ఇది. రాతి కొండపై నీళ్ళు పోస్తే ఏమవుతుంది? కిందకు జారి పోవూ? ఇక్కడున్న బౌద్ధ సన్యాసుల్లో కూడా భావోద్వేగం తక్కువే అన్నారు. ఆధ్యాత్మికతకు ఉత్తరాది ప్రాంతమే ఉత్తమం అన్నారు. అదీను హైదరాబాద్ నుండి ప్రారంభించి.... **ఆధ్యాత్మికత దక్షిణ భారతంలో అగ్గువే అన్నారు బాబా.**

# రావణ రాజ్యంలో

## మెహెరా మెహెర్ వాల్యూం - 2 ఆధారంగా

**రామాయణంలో సిలోన్ ప్రముఖంగా కనిపిస్తుంది అంటూ, ఈ ప్రాంతం రావణుడి** రాజ్యం అన్నారు బాబా. రావణుడు దురుసు స్వభావుడు. అందుకే మీరూ అతనిలా ప్రవర్తిస్తున్నారని స్త్రీ మండలిలోని కొందరిని ఉద్దేశించి ఒక సందర్భంలో ఘాటైన విమర్శ చేశారు బాబా. నేడు సిలోన్‌లో బౌద్ధ మతస్తులు ఎక్కువగా వున్నారన్నారు. **వేయంగోడాలో బంగళా సౌకర్యవంతంగానే వుంది. బాగుంది. పచ్చని ఎత్తైన కొబ్బరి తోటల** నడుమ విశాలమైన ప్రాంగణంలో వుంది. ఐతే బాబా ఎందుకో, ఇక్కడ నుండి మరో బంగళాకు మారాలని మండలిని ఆదేశించారు. ఆయన కారణాలు వేరేగా వుంటాయి కదా. మనకు అర్థం కావు. మా బృందంలో నలభై మందికి పైగా వున్నారు. దానివల్ల ఈ బంగళా సరిపో లేదు. రాత్రిళ్ళు కొంతమంది నేలపై పడుకోవల్సి వచ్చింది. అంతేకాదు, కొబ్బరి చెట్ల నుండి కాయలు రాలే కాలమది. ఎవరిపైనైనా పడితే అనాయాస మరణం తథ్యం అని బాబా నవ్వుతూ మండలిని హెచ్చరించారు. ఒకరికి తృటిలో ఆ ప్రమాదం తప్పింది.

### కాండి నాకు మెహెరాబాద్ లాంటిది

**ఒక సందర్భంలో వేయంగోడా తన కార్యక్రమానికి అనుకూలంగా లేదని బాబా స్పష్టం చేశారు.** అందుకే ఇక్కడ నుండి మరేదైనా అనువైన ప్రాంతం వెదకమని మండలిని ఆదేశించారు. బండారవేల, కాండి, కొలంబో తదితర ప్రాంతాల్లో అనువైన బంగళా కోసం మండలివారు వెతికారు. ఎలిజెబెత్, రానో, కిట్టీ దేవి, ఛాన్జీ, విష్ణు మాస్టర్, డాక్టర్ కాంకిన్ ఆ పనిమీద వుండి చాలా బంగళాలు వెదికారు. ఐతే, వారి ప్రయత్నాలన్నింటికీ ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి.

**బాబా అన్నారు కదా, బండారవేల అయితే వాతావరణం బాగుంటుంది. కాండి నా విశ్వ** కార్యక్రమానికి చాలా అనుకూలంగా వుంటుందన్నారు. సిలోన్‌లో కాండి కాకుండా మరే ఇతర పట్టణమైనా నా కార్యక్రమానికి అనువుగా లేదన్నారు. కాండి నాకు మెహెరాబాద్ లాంటిది అన్నారు. నాలుగు నెలలపాటు వాతావరణం చాలా చల్లగా, ప్రశాంతంగా, హాయిగా వుంటుందిక్కడ అన్నారు బాబా.

**కాండి పట్టణానికి సుమారు 2 కిమీ దూరంలో 'ప్రైమ్‌రోజు ఎస్టేట్‌ని' మూడు నెలల కోసం** బాడుగకు తీసుకున్నారు.

## మెహెరా – మణిజాల డైరీలలో

**ఆ తర్వాత నవంబరు 16న ఉదయం 8.30 నిముషాలకి వేయంగోడా నుండి బాబా** బృందం రెండు బస్సుల్లో కాండికి తరలి వచ్చారు. ప్రైమ్‌రోజ్ ఎత్తైన కొండపైన వుంది. చుట్టూతా పచ్చని వృక్షాలతో నిండిన కొండలు, కొండ దిగువున గలగలాపారుతున్న నది వుంది. ఈ దృశ్యాన్ని కనులారా తృప్తిగా చూడవల్సిందే. మాటల్లో వర్ణించలేం అని, మెహెరా, మణిజా తమ డైరీలలో రాసుకున్నారు. (మెహెరా మెహెర్ 2, పేజి 121).

## మస్తులు చంటిపిల్లల వంటివారు

**ఇక్కడ పది రోజులు నేను కష్టపడి పనిచేయాలి. ఆ తర్వాత పర్యాటక ప్రదేశాలకు** తీసుకెళ్తానని బాబా స్త్రీ మండలితో అన్నారు. గత రెండు రోజులుగా ఇంగ్లాండుపై బాంబుల వర్షం కురుస్తోందని అన్నారు. (రెండవ ప్రపంచ యద్ధ సమయం – 1939 సెప్టెంబరు 1 నుండి 1945 సెప్టెంబరు 2). ఈ యుద్ధ తీవ్రత ప్రభావం మస్తు – చట్టి బాబా ప్రవర్తనలో మార్పు కనిపించింది. ఓ రోజున చట్టిబాబాకు మూడుసార్లు భోజనం పంపించినా, భోజనం ప్లేట్లను విసురుగా గిరవాటేశాడు. ఆహారం తీసుకోలేదు. తీవ్ర కోపంగా వున్నాడు. మస్తులు చంటిపిల్లల వంటివారు. భగవంతుడు వారికి తల్లిలాంటివాడని బాబా అన్నారు. చంటి పిల్లలు అయితే తప్ప ఆధ్యాత్మిక పథంలో ముందుకు పయనించలేరని బాబా అన్నారు.

**కాండీలో కొండపైన వున్న ప్రైమ్‌రోజ్ బంగళాలో బాబా ఒక గదిలో వున్నారు. పురుష మండలి,** మస్తు – చట్టి బాబా వేరే గదుల్లో వున్నారు. కొండ దిగువున వున్న ప్రత్యేక భవనంలో స్త్రీ మండలికి వసతి ఏర్పాటు చేశారు.

**కాండీ అద్భుత పట్టణం అని తిరిగి అన్నారు బాబా. అందుకే దీన్ని "జ్యూయల్ ఆఫ్ ది ఈస్ట్"** అన్నారన్నారు. ఇక్కడున్న బొటానికల్ గార్డెన్స్ ప్రపంచ ఏడు వింతలలో ఒకటి అన్నారు. ఇది ఆసియా ఖండంలోనే అత్యుత్తమం అని అభివర్ణించారు. మేమయితే, టైం లేక ఈ గార్డెన్స్‌ని బస్సులో వెడుతూ, 'అదిగో ద్వారక' అనిపించాం. సమాచారం లోపం వల్ల కొన్ని ముఖ్యమైన వాటిని ఆకాశంలో అరుంధతి చూపించినట్లు "మమ" అనిపించారు. పర్యాటకంలో ఇది సహజమే! బాబా బృందం పర్యటించింది 1940 నవంబరు – డిసెంబరు నెలలు కదా. ఆ కాలంలో ఇక్కడ తరచు వర్షాలు పడుతుండేవి. ఆ సమయం ప్రకృతి అందచందాలను మాటల్లో వర్ణించలేమని మెహెరా మాయి, మణిజాలు తమ డైరీలలో రాసుకున్నారు.

**సిలోన్‌లో వుండగా నేను పేదల కోసం ఎలా పనిచేస్తానో గమనించండన్నారు.** ముగ్గురు స్త్రీ మండలిని – నాడినే, ఐరినె, మన్సారి మాయిలను మూడు నెలలు మౌనం వుండమన్నారు.

వారు పాటిస్తున్న మౌనం బాబావారి ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఎంతగానో ఉపయోగపడు తోందన్నారు బాబా. నవంబరు 22 తర్వాత బాబా స్త్రీ మండలిని కారులో తీసుకుని కాండీలోని బొటానికల్ గార్డెన్స్ సందర్శించారు. ఆ మర్నాడు కాండి లేక్‌కి, టీ తోటలు, అక్కడ నుండి స్పైస్ గార్డెన్స్‌కి వెళ్ళారు. ఆ రోజు మధ్యాహ్నం ఏనుగులు స్నానం చేస్తున్న దృశ్యాన్ని చూడ్డానికి వెళ్ళారు.

## శ్రీలంకలో బ్లూ బస్

**ఆ పిదప, నవంబరు 23 తేదీన మన దేశం నుండి వయా ధనుష్కోటి ద్వారా సిలోన్‌కి బ్లూ బస్ వచ్చింది.** కాండి నుండి బ్లూ బస్‌లో బయల్దేరి, బౌద్ధ పుణ్య క్షేత్రాలు ఎక్కువగా వున్న డంబుల్లా, అనురాధపుర పట్టణాలను సందర్శించారు. బాబా కారులో ప్రయాణించారు. మండలి వారి ప్రయాణం బ్లూ బస్‌లో కొనసాగింది. ముందుగా, డాంబుల్లాలో వున్న నల్ల రాతి గుహల్ని సందర్శించారు. ఇక్కడ 50 అడుగుల పొడవు వున్న బుద్ధ భగవానుడు పడుకుని దర్శనమిస్తాడు. బుద్ధుని జీవితంలోని ప్రధాన ఘట్టాలు రంగుల చిత్రాలు రాతి గోడలపై అందంగా చిత్రీకరించారు. ఆ మర్నాడు అనురాధపుర సందర్శించారు. ఇక్కడ బౌద్ధ ఆరామాలతోపాటు, బౌద్ధ గయ నుండి తీసుకొచ్చిన మహా బోధి వృక్షాన్ని సందర్శించారు.

**కాండిలో నా కార్యక్రమం చాలా చక్కగా జరిగింది. ఐతే, నా దేహంలోని ప్రతి ఎముక నొప్పి పుడుతోంది.** నా కార్యక్రమంలో మస్తు చట్టి బాబా ఎంతో సహాయం చేశాడు. వేయంగోడాలో నా కార్యక్రమం నిర్వహించడం చాలా కష్టమైంది. కాండిలో జరిగినట్లుగా నా కార్యక్రమం మునుపెన్నడూ జరగలేదని బాబా ప్రకటించారు. ఇక్కడ మస్తుతో నా కార్యక్రమం కేవలం రెండవ ప్రపంచ యుద్ధానికి సంబంధించి మాత్రమే కాదు, కొన్ని సంవత్సరాల తర్వాత శ్రీలంకలో అంతర్యుద్ధం (సివిల్ వార్) జరగబోతోందని బాబా హెచ్చరించారు.

**స్థానిక శ్రీలంక ప్రభుత్వం - ప్రత్యేక తమిళ రాష్ట్రం కావాలని కోరిన తమిళ టైగర్ల** (లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిల్ ఈలం **(LTTE)** ల నడుమ సుమారు 26 సంవత్సరాలు (1983 జూలై 23 నుండి 2009 మే వరకూ) భీకర పోరు శ్రీలంకలో జరిగింది. ఈ సంఘర్షణలో వేలాదిమంది తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. చివరకు, శ్రీలంక సైన్యం విజయం సాధించింది. ఈ అంతర్యుద్ధానికి సంబంధించి బాబా సుమారు 40 సంవత్సరాల ముందు ఇక్కడకు వచ్చి, ఏకాంతవాసం గడిపారు. తన విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. **బాబా కార్యక్రమం సామాన్యులకు ఏం బోధపడుతుంది?**

# చివరిగా, అవీ ఇవీ - బంగారు పేటికలో బుద్ధుని దంతం



**కాండి పట్టణ నడిబొడ్డున, ఆనాటి రాజ** ప్రాసాదంలో వున్న బౌద్ధారామంలో బుద్ధుని నోటిలోని పన్నుని ఒక బంగారు పేటికలో బధ్రపరిచి భక్తితో నిత్యపూజలు అందజేస్తున్నారు.
**4వ శతాబ్దంలో కళింగ రాజ్యం నుండి** ఈ పన్ను శ్రీలంకకు తీసుకువచ్చారు. 1940 నవంబరులో బాబా మండలితో ఈ దేవాలయాన్ని సందర్శించారు.

## ఊహించి, స్పందించగలరా!

**ఈ తరంలో బాబావారు వాడిన అనేక వస్తువులు ముఖ్యంగా బాబావారి సాద్రా చాలామంది ప్రేమికుల వద్ద వున్నాయి. ఈ పవిత్ర అంగి భవిష్యత్తులో ఎలాంటి పూజలు అందుకోనుందో కదా! ఊహించగలరా మహాశయా!**

## రాంబోడాలో హనుమంతుని దేవాలయం



**కాండి పట్టణానికి సుమారు 45 కిమి దూరంలో రాంబోడా అనే ప్రాంతంలో వున్న ఆంజనేయుని** దేవాలయం తప్పక సందర్శించవల్సిందే. ఇక్కడ అంజనీ పుత్రుని ఏకశిలా విగ్రహం 16 అడుగుల ఎత్తున వుంది. 2001లో చిన్మయా మిషన్ ఈ దేవాలయ నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయానికి ఎదురుగా వున్న ఎత్తైన కొండపై ఆంజనేయుడు ఛాయా మాత్రంగా కనపడతాడు. అంతేకాదు, సీతమ్మను వెదుకుతూ లంకలో అడుగుపెట్టిన వాయు పుత్రుడు తొలి రోజున ఈ ప్రాంతంలో కొద్దిసేపు సేదతీరాడని స్థలపురాణంగా చెప్తున్నారు. **ఏదిఏమైనా పరిశుభ్రమైన, ప్రశాంత చల్లని ప్రాంతంలో** వున్న ఈ దేవళాన్ని సందర్శించాలనుకోవడం ముదావహం!



## వాయు పుత్రుడు

న్యూవారా ఏలియా అనే పట్టణంలో సీతమ్మ అగ్నిప్రవేశ స్థలానికి సమీపంలో అమ్మవారి ఆలయం వుంది. ఆ ఆలయం ప్రక్కనే ఆంజనేయుని 5 అడుగుల విగ్రహం వుంది. ఈ విగ్రహ ప్రత్యేకత గురించి చెబుతూ, "ఈ విగ్రహం 'మామిడి చెట్టు' కాండంతో మలిచారని చెప్పారు. ఈ విగ్రహానికి ఎదురుగా ఒక లేతాకుపచ్చ చెట్టు వుంది. అయ్యవారి ఛాతీపై సుతారంగా కొడితే, ఎదురుగా వున్న ఆ పచ్చని చెట్టు ఆకులు లయబద్ధంగా కదులుతాయి. వాయు పుత్రుడు కదండి! అన్నారు స్థానికులు. భగవంతుని ఆలయాల్లో అడుగడుగునా కనిపించే, వినిపించే విశేషాలు ఎన్నో, ఎన్నెన్నో కదా!

**ఈ మాదిరిగానే, తలైమన్నార్‌కి వెళ్తూ, మార్గంలో వున్న ఒక పురాతన శివాలయాన్ని దర్శించుకున్నాం.** మాలో చాలా కొద్దిమంది మాత్రమే లోనికివెళ్ళి శివ దర్శనం చేసుకు న్నారు. చాలామంది ఆలయం బైట నిల్చునే శివార్పణం అన్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం పైనున్న అంగీ విప్పి, లుంగీ ధరించి, స్వామిని దర్శించాలన్నారు. అందుకే మాలో చాలా మందిమి నీలకంఠుడిని మనస్సులోనే నమ స్కరించుకున్నాం.



**అనురాధపుర – కాండి పట్టణాల నడుమ ప్రయాణం చేస్తుంటే మార్గమధ్యంలో టీ అంగడి దగ్గర కొద్దిసేపు ఆగాం. ఆ క్షణంలో యాపిల్ ఫోన్‌లో 'క్లిక్' మనిపించాం!**

# శ్రీ రాయల బాబాలో ఐక్యం



శ్రీ రాయల రామచంద్రయ్య, అధ్యక్షులు, అవతార్ మెహెర్‌బాబా ఖమ్మం కేంద్రం 2026 ఏప్రిల్ 6న బాబాలో ఐక్యమయ్యారు. అవతారుడ్ని తన ఇలవేల్పుగా ఆరాధిస్తూ, ప్రేమిస్తూ, గత కొన్ని దశాబ్దాలుగా బాబా సేవలకు అంకితమయ్యారు శ్రీ రామచంద్రయ్య. ఆయన మరణం బాబా ప్రేమికులకు, ముఖ్యంగా మెహెర్‌బాబా పత్రికకు తీరని లోటు. **బాబా సాహిత్యాన్ని ఆసాంతం చదివిన కొద్దిమందిలో శ్రీ రాయల ఒకరు. ఖమ్మం కేంద్రం తరఫున** అంతర్జాతీయ ప్రేమిక సహవాస్‌లను నిర్వహించి, ఆయా సందర్భాలలో ప్రత్యేక సంచికలను అందించిన శ్రీ రామచంద్రయ్య గొప్ప సాహిత్యాభిలాషి అని, ఖమ్మం కేంద్రం తరఫున పలు బాబా పుస్తకాలను ఆయన ప్రచురించారని స్థానిక బాబా ప్రేమికులు ఆయన సేవల్ని గుర్తుచేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని బాబాని ప్రార్థిస్తూ ఏప్రిల్ 16న ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఖమ్మం కేంద్రంలో నిర్వహించారు.

# వెంకట్రావ్‌పేట కేంద్ర 30వ వార్షికోత్సవం

**మంచిర్యాల జిల్లా, వెంకట్రావ్‌పేట కేంద్ర 30వ వార్షికోత్సవం సందర్భంగా 2026 ఏప్రిల్** 18వ తేది మ. 1 గంట నుండి రాత్రి 9 గంటల వరకూ, తిరిగి ఏప్రిల్ 19వ తేది ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆహ్వానం పంపారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో హాజరు కావల్సిందిగా కేంద్ర నిర్వాహకులు కోరుతున్నారు.

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ కోసం 2026 మార్చి – ఏప్రిల్ నెలలలో**

1. శ్రీమతి సునీత, బెంగళూరు రూ. 1000/–, 2. శ్రీ గోరు సుందరరావు గారి భార్య, శ్రీమతి గోరు నాగమణి, విశాఖపట్నం పంపినారు.

**వీరద్దరికి పత్రిక పక్షాన ధన్యవాదములు, జైబాబా.**

# బాబా ఏకాంతవాసం-మహాబళేశ్వర్‌లో

## వార్డ్‌పార్క్ ప్రసంగం

**నవజీవనంలో భాగంగా మెహెర్‌బాబా మహాబళేశ్వర్‌లో నూరు రోజులపాటు 1951** ఫిబ్రవరి 13 నుండి 1951 మే 24 వరకూ ఏకాంతవాసం నిర్వహించారు. ఆ తదుపరి, ఖాజాగూడాలో బాబా మనోనాశ్ కార్యక్రమం చేపట్టారని శ్రీ వార్డ్‌పార్క్ అన్నారు.

బాబా చేపట్టిన ఏకాంతవాసంపై ఏప్రిల్ 12, ఆదివారం, జూబ్లి బాబా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో శ్రీ వార్డ్‌పార్క్, మెహెరాబాద్, ప్రసంగించారు.

ఈ సమయంలో బాబావారి కార్యదర్శి విడుదల చేసిన లైఫ్ సర్క్యులర్‌లను ఉదహరిస్తూ శ్రీ వార్డ్‌పార్క్ లోతైన విశ్లేషణ చేశారు.

**మెహెర్‌బాబా ఖాజాగూడాలో మనోనాశ్ నిర్వహించి 75 సంవత్సరాలు నిండుతున్న** సందర్భంగా 2026 అక్టోబరు 17 – 18 తేదీలలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సహవాస్‌లో భాగంగా, ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## గాజువాక

**గాజువాక బాబా కేంద్రంలో మార్చి 1న ప్రత్యేక సంకీర్తన కార్యక్రమం నిర్వహించినట్లు ఒక** ప్రకటనలో తెలిపారు. మార్చి 15న మెహెర్ గ్రామీణ సహవాస్ 'యారాడ' గ్రామంలో వేడుకగా నిర్వహించడమైంది. అనంతరం మార్చి 22, 29 తేదీలలో సత్సంగ్ కార్యక్రమాలు, మార్చి 28న శ్రీ దీప్తి మహంతి శ్రీరామమూర్తి గారి సంస్మరణార్థం సత్సంగ్ నిర్వహించినట్లు తెలిపారు.



## శ్రీ ఆకురాతి

అవతార్ మెహెర్‌బాబా నరసరావుపేట కేంద్రం ప్రేమికులు శ్రీ ఆకురాతి వీరాస్వామి (90) 2026 ఏప్రిల్ 11 శనివారం బాబావారి నామస్మరణతో అవతారునిలో ఐక్యమయ్యారని శ్రీ వంకాయల అచ్చుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని స్థానిక బాబా కేంద్రంలో బాబా నామస్మరణ చేశామని ఆయన అన్నారు.

# బాబా ప్రేమికుల శ్రీలంక యాత్ర

## 2026 మార్చి 18-26



వేయంగోడాలో



హనుమాన్ దేవళం




వేయంగోడాలో







**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 2000/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 17320100002915 2, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 150/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 17320100002797 3, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.


**మా అడ్రస్:**

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్,** యాప్రాల్, ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.
ఫోన్: **99595-53218. email: malladisukku@gmail.com**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Caxton Printers, Lakdi-ka-Pul, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Posted at Patrika Channel, Nampally, Hyderabad.**